
ప్రజాశక్తి

శనివారం 5 జూలై 2025 5 విజయనగరం



నేడు జాతీయ లోక్ అదాలత్


ప్రజాశక్తి-విజయనగరంలీగల్

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 20 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, , ఎక్సజ్ కేసులు, భూమి తగాదా కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మరియు ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు, ప్రజలు ఈ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగపరచుకోవాలని కోరారు.

విద్యార్థుల అడ్మిషన్ల తగ్గుదలపై

శాస్త్రీయ విశ్లేషణ

- తాటిపూడి నీటిపై ఆందోళన వద్దు : ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి
- విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకోవాలి : జెడ్పి చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ చేయాలని ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు, నాణ్యమైన ఆహారం, మెరుగైన సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని, ప్రతి విద్యార్థిపైన ఏడాదికి సుమారు రూ.70వేల ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వివరించారు. ఆయినప్పటికీ నమోదు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించి, తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

జెడ్పి సర్వ సభ్య సమావేశం చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. విద్యాశాఖపై చర్చ నడుస్తుండగా జెడ్పి చైర్మన్ స్పందిస్తూ విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే విషయమని, సంఖ్య తగ్గకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో తెలియ జేయాలని కోరారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 8వేల వరకు అడ్మిషన్లు తగ్గినప్పటికీ, ఆఫ్ లైన్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని కలిపినా నమోదు తగ్గితే, అందుకు గల కారణాలను గుర్తించాలని డిఇఒకు సూచించారు. తగ్గిన అడ్మిషన్లు, ప్రైవేటు స్కూల్స్‌కు వెళ్తున్నాయా? కుటుంబాల వలసల కారణంగా తగ్గుతుందా? ఇతర కారణాలమైనా ఉన్నాయా? అనే విషయాలను సర్వే చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం పథకం కింద మిగిలిన రూ.2వేలు పాఠశాలల ఖాతాల్లో జమచేశారా? అని ప్రశ్నించారు. దీనిపై విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తూ అడ్మిషన్స్‌పై స్పెషల్ డ్రైవ్ తీసుకోనున్నామని, ఐదేళ్ళు నిండిన ప్రతి ఒక్క బాల బాలిక ఏదో ఒక పాఠశాలలో ఉండేలా చూస్తున్నామని, బడి బయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద మిగిలిన రూ.2వేలు స్కూల్ మానేజ్మెంట్ కమిటీల ఖాతాలలో జమ చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లు లేరని, సచివాలయాల నుండి డెప్యుటేషన్‌పై వేస్తే బాగుంటుందని కోరారు. ఎంఎల్‌సి రఘురాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ కృషి చేసారని, వారి ఆదేశాలతో ప్రైవేటు పాఠశాలల్లో కదలిక వచ్చిందని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. డిగ్రీ కళాశాల కోసం ఒక భవనం వెంటనే అవసరం ఉందని, ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

తాటిపూడి జలాశయం నీటిని బొడ్డవరలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుకు తరలిస్తే సాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయంటూ తొలుత గంట్యాడ జెడ్‌పిటిసి, ఆ తరువాత ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు తగ్గ భరోసా సమావేశంలోనే ఇవ్వాలని కోరారు. జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిఒ వచ్చిందని, జిందాల్ సంస్థే స్వయంగా నీటిని సమకూర్చుకోవాలని, ప్రభుత్వం నీరందించాలని ఉంది కానీ తాటిపూడి నుండే అందించాలని స్పష్టంగా లేదని తెలిపారు. తాటిపూడి కేవలం రైతులకు నీరందించదానికే ఉద్దేశించిన జలాశయమన్నారు. దీనిపై మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ నీటికోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎంఎస్ఎంఇ పార్కుకు తాటిపూడి నుండి నీరందించడంపై ప్రభుత్వంలో ఇంకా చర్చించలేదని తెలిపారు. రైతులు కూడా అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని వివరించారు.

బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ ఏనుగుల దాడికి పంట పొలాలు పాడయ్యాయని, రైతుల బోరు బావులు, పైప్ లైన్లు దెబ్బ తిన్నాయని, వారికీ పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో 2.26లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. దీనిపై పలువురు సభ్యులు స్పందిస్తూ అధికారులు మ్యుటేషన్ చేయకపోవడం, 1 బి, ఆధార్ తో లింక్ కాకపోవడం వంటి కారణాల వల్ల అన్నదాత సుఖీ భవ పథకం 40 శాతం మంది రైతులు లబ్ధిపొందలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారి వివరణ ఇస్తే విజయనగరం జిల్లాలో 20వేల మంది, పార్వతీపురం జిల్లాలో 7వేల మంది రైతుల ఖాతాలు ఇకెవైసి వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెరిఫికేషన్‌లో అర్హులైన రైతుల పేర్లను జాబితాలో చేరుస్తామని ఇరు జిల్లాల అధికారులు వివరించారు.

చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని, రైతులకు సకాలంలో అందేలా చూడాలని కోరారు. మెడికల్ కళాశాల వద్దకు ఆసుపత్రిని తరలిస్తే ప్రజలకు దూరం అవుతుందని, అలాగే అటువైపు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా లేదని, కొన్ని విభాగాలను బోధనాసుపత్రి వద్ద ఏర్పాటు చేసి, పాత ఆసుపత్రినే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి తెలిపారు.

కార్యక్రమంలో తొలుత అల్లూరి సీతారం రాజు జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంద్యారాణి, మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ప్రభుత్వ విప్ తోయిక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనేల రవిచంద్ర, లోకం నాగమధవి, డిసిసిబి , డిసిఎంఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్‌లు కిమిడి నాగార్జున, గొంప కృష్ణ, పాలవలస యశస్వి, ఇరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ఘనంగా అల్లూరి జయంతి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి సేతుమాధవన్, అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంకోట, కంటోన్మెంట్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవం కలెక్టరేట్ ఆడిటోరియం, జిల్లా పోలీసు కార్యాలయం, పోలీసు శిక్షణ కళాశాలలో శుక్రవారం ఘనంగా జరిగింది. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమానికి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన దేశభక్తి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళి, ఎస్‌డిసి ప్రమీలాగాంధీ, జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి, సెట్విజ్ సిఇఒ వెంకటేశ్వర్రావు, డిఐపిఆర్ఒ మల్లేశ్వర్రావు, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పించిన జిల్లా పోలీసుశాఖ

అల్లూరి సీతారామరాజు జయంతిని పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పి వకుల్ జిందల్ హాజరై అల్లూరి సీతారామ రాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మన్యంలో బ్రిటీషు వారి దోపిడీని ఎదుర్కొని, గిరిజనులకు అండగా నిలిచి, వారిని ఎంతగానో చైతన్య పర్చారన్నారు. అల్లూరి సీతారామ రాజు నేడు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పి జి.నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్‌పి వై.రవీంద్రరెడ్డి, ఎఒ పి.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌వి ఆర్‌కె చౌదరి, ఆర్ఎన్. గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్,టి.శ్రీనివాస రావు, ఆఫీసు పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పిటిసిలో.. అల్లూరి విగ్రహానికి ప్రిన్సిపాల్ డి.రామ చంద్రరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వి.అప్పారావు, డిఎస్‌పి టి.రమేష్, మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, ఎఒ టి.భవాని పాల్గొన్నారు.

బొబ్బిలి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఎమ్మెల్యే బేబినాయన ఘనంగా నిర్వహించారు. అల్లూరి స్ఫూర్తితో గిరిజనుల సమస్యల పరిష్కారానికి పని చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డెంకాడ : భోగాపురం ఎంపిడిఒ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి, పింగళి వెంకయ్య వర్థంతిని ఎంపిడిఒ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి, పింగళి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం : పెరుమాలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సర్పంచ్ ప్రతినిధి ఎస్.అప్పల నరసింహరాజు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి జగన్నాథరాజు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం కళాశాల నుంచి దేవి కూడలి వరకు ర్యాలీ, మానవహారాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్ కేశవ రావు, వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు, అధ్యాప కులు చల్ల శ్రీనివాసరావు, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ వి.సుధీర్, డాక్టర్ ఆర్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తవలస : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్దనున్న అల్లూరి పార్కులో అల్లూరి సీతారామరాజు జయంతిని క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ రమణయ్య, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, సమితి అధ్యక్షులు గోపిరాజు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతనెల 29న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఇండోర్ హాల్లో జరిగిన అండర్ 10, అండర్ 12విభాగాల 9వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 5 మంది ఫెన్సింగ్ క్రీడాకారులు సైబర్ , ఇప్పి, ఫాయిల్ విభాగాల్లో ఎంపికయ్యారు. వీరంతా మహారాష్ట్ర నాసిక్‌లో ఈనెల 5 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డిఎస్‌డిఒ వెంకటేశ్వర రావు, జిల్లా ఫెన్సింగ్ సంఘ సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్ , వెంకటేష్ , కోచ్ డి.వి చారి, ప్రసాద్ అభినందనలు తెలిపారు.

జిఒ 4 పారా క్రీడాకారులకు వరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సారధి వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్ లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ నంబర్ 4 పారా క్రీడలు ఆడే వికలాంగులకు వరం లాంటిదని అన్నారు. ఈ జిఒ ద్వారా ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 3 శాతం ఉద్యోగాలను ఎటువంటి రాత పరీక్ష గాని, ఇంటర్వ్యూ గాని లేకుండానే విద్యార్హతను బట్టి నేరుగా ఉద్యోగాలు కల్పిస్తుందని అన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన పారా క్రీడాకారులకు లక్షలాది రూపాయలు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సారధి వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్ వ్యవస్థాపకులు ప్రదీప్, ద్వారకామయి అంధుల పాఠశాల వ్యవస్థాపకులు ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు ఎన్ఐఎ ఆరా!

టూ టౌన్‌లో సిరాజ్ సమీర్‌ల కేసు ఫైల్లు తనిఖీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన ఉగ్రదాడి అనుమానితుల కేసును స్వాధీనం చేసుకునేందుకు విజయనగరానికి వచ్చిన ఎన్ఐఎ టీమ్ మూడో రోజు శుక్రవారం ఆరా తీసింది. టూ టౌన్ పోలీసు స్టేషన్ లో సిరాజ్, సమీర్‌ల కేసు ఫైల్స్‌ను లోతుగా పరిశీలించారు. మినిస్టర్ ఆఫ్ హోం అఫైర్స్ నుండి అనుమతి తీసుకున్న నేపథ్యంలో విజయనగరం టూ టౌన్ పోలీసుల నుంచి కేసును ఎన్ఐఎ స్వాధీనం చేసుకుంది. కేసుతో పాటు, వాటికి సంబంధించిన రికార్డులన్నీ టూటౌన్ పోలీసులు ఎన్ఐఎకు అప్పగించినట్లు సమాచారం. ఇప్పటికే విశాఖ సెంట్రల్ జైలులో ఉగ్రదాడి కేసు అనుమానితులు సిరాజ్, సమీర్ లు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. మే 16న వీరిద్దరిపై విజయనగరం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తరువాత వారంరోజులు పాటు క విజయనగరం టూ టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఎన్ఐఎ, కౌంటర్ ఇంటిలిజెన్స్, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ సమక్షంలో వారం రోజులు పాటు వీరిని టూ టౌన్ పోలీసులు విచారించారు. కస్టడీ విచారణలోరాబట్టిన పలుకీలక విషయాలను, సిడి ఫైల్స్ ఎన్ఐఎకు పోలీసులు అప్పగించారు. రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని కస్టడీ కోరుతూ ఎన్ఐఎ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. విచారణలో మరింత కీలక సమాచారం వచ్చే అవకాశం. ఇదే విషయంపై టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఎన్ఐఎకు అప్పగించినట్లు ఉత్తర్వులు రావడమే వాస్తవమేనని, ఇంకా ఉత్తర్వులు అందాల్సి ఉందని తెలిపారు.



నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసిత రైతులు

జిఒ 14ను రద్దు చేయాలి

జిందాల్ బాధితుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తాటిపూడి నీరు రైతులకే సొంతమని, జిందాల్‌కు ఇచ్చే ప్రసక్తే లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన జిఒ 14ను రద్దు చేయాలని కోరారు. శుక్రవారం జిందాల్ నిర్వాసిత రైతులతో కలిసి బొడ్డవర వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు తాటిపూడి నీరు విడుదల చేసిన సందర్భంలో జిల్లా మంత్రి మోసపూరిత మాటలు చెప్పి రైతులను గందరగోళ పరుస్తున్నారని చెప్పారు. జిఒ 14ను రద్దు చేసినప్పుడే తాటిపూడి ఆయకట్టు రైతులకు రక్షణ ఉంటుందన్నారు. ఆ జిఒ రద్దు చేయకుండా తాటిపూడి నీరు జిందాల్ పరిశ్రమకు ఇవ్వబోమని చెప్పడమంటే, రైతులను అన్యాయం చేయడమేనని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ నిర్వాసితులు పాల్గొన్నారు.

అనధికార హోర్డింగ్‌లపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనధికార హోర్డింగులు, నిర్మాణాలను అనుమతించేది లేదని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలోను, కామాక్షి నగర్‌లోను అక్రమ నిర్మాణాలను ప్రణాళిక సిబ్బంది తొలగించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో ఓ భవనం పై అంతస్తులో అనుమతులు లేని ప్రకటన బోర్డును (మోర్డింగ్) ఏర్పాటు చేసినట్లు గుర్తించిన ప్రణాళిక సిబ్బంది కమిషనర్ ఆదేశాలతో తొలగించారు. కామాక్షి నగర్‌లో వాణిజ్య భవనానికి ఆనుకొని అనుమతులు లేకుండా ఐరన్ మెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తించి తొలగించారు.

త్వరలో 'తల్లికి వందనం' 2వ విడత నిధులు విడుదల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తల్లికి వందనం పథకం కింద 2వ విడతలో భాగంగా 1వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిధులు విడుదల చేయనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు యు.అన్నపూర్ణమ్మ తెలిపారు. తల్లికి వందనం పథకం నగదు జమ చేసేందుకు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుచున్న విద్యార్థులు, విద్యార్థి పేరుతో వారికి అందుబాటులో ఉన్న పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంకులో అకౌంటు ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. బ్యాంక్ అకౌంటు ఓపెన్ చేసుకున్నవారు వారి ఆధార్ నెంబరుతో లింక్ చేసుకోవాలన్నారు. పోస్టల్ ఆకౌంటు ఓపెన్ చేసేందుకు పోస్టల్ డిపార్ట్మెంట్ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసిందని, విద్యార్థులు ఈ సదుపాయం వినియోగించుకోవాలని కోరారు.



ఎంఎంఎస్ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ఎంఎంఎస్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-రాజాం

రాజాం మండల మహిళా సమాఖ్యకు జాతీయ ఆత్మనిర్భర్ పురస్కారం రావడం పట్ల ఆ సమాఖ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం ఎంఎంఎస్ సభ్యులను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రత్యేకంగా అభినందించారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. తృతీయ అవార్డుకు ఎంపికవడంతో మండల మహిళా సమాఖ్యకు రూ.లక్ష నగదుతోపాటు మెమోంటో, సర్టిఫికెట్‌ను ఈ నెల 15న ఢిల్లీలో అందిస్తారని డిపిఎం ఎ.చిరంజీవి తెలిపారు.

జిల్లా కోర్టు పిపిగా గేదెల సత్యం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్



డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఇంఛార్జి పిపిగా గేదెల సత్యంను నియమిస్తూ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ (విజయవాడ) ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఫ్యామిలీ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సత్యంను జిల్లా కోర్టు, సబ్ కోర్టు భాద్యతలు కూడా చూడాల్సిందిగా 3 మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డిఒపి ఆదేశాల మేరకు అపాయింట్ మెంట్ ఆర్డర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబితకు, అసిస్టెంట్ కోర్టు న్యాయమూర్తి లక్ష్మి కుమారికి అందించి ఆయన విధులలో చేరారు. ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా సత్యం తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లాకు చెందిన రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన



విజయనగరం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ఉద్యోగులు శుక్రవారం ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ సస్పెన్షన్లు, తొలగింపు లేకుండా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, వెంటనే పదోన్నతులు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారానే కొనాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని, పెండింగ్ డిఎ బకాయిలు చెల్లించాలని కోరారు. 11వ పిఆర్‌సి 24నెలల బకాయిలను ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్ మెంట్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీగా అనేక ఇబ్బందులు తలెత్తుతాయని,కాలం చెల్లిన బస్సులు స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్ పి పట్నాయక్, డివిఆర్ఎస్ నారాయణ , కెవి రమణ , పి.శ్రీను జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎ.అశోక్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.జి.నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం డిపో ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్ష, కార్యదర్శి కెకె రావు, జి.రవికాంత్, డిపో కార్యదర్శి కొల్లి కోటేశ్వరరావు, ఎస్ఎ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత జోన్లలోనే వీధి విక్రయాలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వీధివిక్రయాలు సాగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చిరు వ్యాపారులకు సూచించారు. శుక్రవారం తోపుడు బండ్ల వర్తకులతో నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా నూతన విధానాలను అవలంభించబోతున్నట్లు చెప్పారు. నగరంలో రెడ్ జోన్, అంబర్ జోన్, గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనసమ్మర్థం ఉన్న ప్రాంతాన్ని రెడ్ జోన్ గాను, నిర్దేశిత సమయంలో మాత్రమే చిరు వ్యాపారాలు చేసుకునే వెసులుబాటును కల్పిస్తూ అంబర్ జోన్లను, నిత్యం చిరు వ్యాపారుల సాగించుకునేందుకు గ్రీన్‌జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రదేశాలను నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ధ్రువపత్రాలు

విజయనగరం టౌన్ : బదిలీ అయిన సచివాలయ కార్యదర్శులకు శుక్రవారం కమిషనర్ పి.నల్లనయ్య ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు తమ విధులు పట్ల మరింత బాధ్యతాయుతంగా, చురుకైన పాత్రను పోషించాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పౌర సేవలు విస్తతపరచాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ అందరూ సమిష్టిగా కృషి చేసి నగరపాలక సంస్థకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఎఒ సీతారామమూర్తి పాల్గొన్నారు.

మానికొండ సూర్యావతి స్ఫూర్తితో

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



సూర్యావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళా ఉద్యమ నేత, ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సూర్యావతి స్ఫూర్తితో మహిళలు ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపునిచ్చారు. సూర్యావతి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నగరంలోని 46వ వార్డులో జరిగింది. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా ఇందుపల్లి గ్రామానికి చెందిన సూర్యావతి మహిళలకు విద్యా సౌకర్యాలు కల్పించాలని, పురుషులతో పాటు సమాన కూలి ఇవ్వాలని, ఆస్తిహక్కు కల్పించాలని, మరుగు దొడ్లు, ప్రసూతి ఆసుపత్రులు కట్టించాలని తీర్మానాలు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి పంపారన్నారు. ఆ తరువాతి కాలంలో వాటి సాధనకు అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. మొక్కవోని దీక్షతో మహిళా సంఘ నిర్మాణానికి సూర్యావతి ఎంతగానో కృషి చేశారన్నారు. మహిళా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. సూర్యావతి 1950వ దశకంలోనే నందమూరు పంచాయితీ ఎన్నికల్లో మూడు సార్లు ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1958లో ఎంఎల్‌సిగా ఎన్నికై శాసన మండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించారని తెలిపారు. జీవితమంతా ప్రజల కోసమే పోరాడిన ధీర వనిత సూర్యావతి స్ఫూర్తి తో నేటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మహిళా హక్కులు కోసం, మహిళా రక్షణ కోసం ఉద్యమించాలని రమణమ్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనస్తీషియాలో నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవాలి

విజయనగరంకోట : అనస్తీషియాకు సంబంధించిన నూతన ఆవిష్కరణలను వైద్యులు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్, ఎనస్తీషియా వైద్య నిపుణులు డాక్టర్ డివిజి శంకరరావు సూచించారు. ఐఎస్ఎ రాష్ట్ర సంఘం 34వ వార్షి కోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో జరుగుతున్న దక్షిణ భారతదేశ స్థాయి వైద్యుల సదస్సులో ఒక సెషన్ కు డాక్టర్ శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి సంబంధించిన అన్ని విభాగాలలో ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు వస్తూనే వున్నాయని, అనస్తీషియా విభాగానికి సంబంధించి వస్తున్న మార్పులను వినియోగించుకుని శస్త్ర చికిత్స సమయంలో రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడవచ్చన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఏడు రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది మత్తు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి-బొబ్బిలి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించారు. సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ యూనియన్ కార్యదర్శి తెంటు రవి చెప్పారు. 10 రోజులలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే మరల సమ్మె చేస్తామన్నారు. సమ్మె విరమణ లేఖను మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్‌కు అందించారు. శనివారం నుంచి విధులకు హాజరవుతామని చెప్పారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజాశక్తి-రాజాం

ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 50కి పైగా వినతులు వచ్చాయి. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, రెవెన్యూ సమస్యలపై అధికంగా వినతులు అందాయి. గతంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 90 శాతానికి పైగా సమస్యలు పరిష్కరించామని ఎమ్మెల్యే కోండ్రు తెలిపారు. అనంతరం పట్టణంలో కొండక వీధిలో రూ.8.50 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు, డ్రైయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రామప్పలనాయుడు, టిడిపి నాయకులు కోండ్రు జగదీష్, నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, దుప్పలపూడి శ్రీను, వాగు వెంకటరావు, మరిపి జగన్ మోహన్, కాటం శ్రీను, పిల్లా సత్యంనాయుడు, చిట్టి సూరిబాబు, జరజాన నితిన్, బిజెపి నాయకులు కోటగిరి నారాయణరావు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

చింతలవలసలో డిఎల్‌పిఒ పర్యటన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చింతలవలస గ్రామంలో డిఎల్‌పిఒ ఆర్.శిరీషారాణి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. మంచినీటి ట్యాంకును పరిశీలించి, క్లోరినేషన్ క్లీనింగ్ చేస్తున్నారా? లేదా? అని పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని సూచించారు. విజయ ఫుడ్ కోర్ట్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను పరిశీలించి తాగడానికి వినియోగిస్తున్న నీరు ఇవ్వాలని సూచించారు. ఎనిమిదవ తరగతి పిల్లలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, సర్పంచ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట



విజయనగరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్తగా సామనేటి శ్రీనివాస్‌ను పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి శుక్రవారం నియమించి నట్లు జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన కరికులం ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్ పేరిట రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 30మంది అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా ఎంబిబిఎస్ విద్యార్థులకు నైపుణ్యాల ఆధారిత వైద్య విద్యను బోధించేందుకు అధ్యాపకులను సిద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పద్మలీల ప్రారంభించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డాక్టర్ పిఎం రమణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సునీత, డాక్టర్ దేవి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శివ శ్రీధర్, డాక్టర్ జెఎన్‌వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుకు అటవీ అనుమతులివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పల్లపుదుంగాడ, దబ్బగుంట గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం అటవీ అనుమతులు మంజూరు చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు కోరారు. ఈ సందర్భంగా రోడ్డుకు అటవీ అనుమతులు మంజూరు చేయాలని పట్టణంలోని అనంతగిరి రేంజ్ అటవీ కార్యాలయం వద్ద శుక్రవారం గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. డోలీమోతల బారి నుండి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దారపర్తి మాజీ సర్పంచ్ పాడి ఎర్రయ్య, చిన్నారావు పాల్గొన్నారు.

గంటి ప్రసాదానికి ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

గంటి ప్రసాదం వర్థంతి సందర్భంగా శుక్రవారం ఘన నివాళు లర్పించారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో ఆయన చిత్రపటానికి ఇప్టూ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, అమరుల బంధు మిత్రుల సంఘం అధ్యక్షులు అంజమ్మ, పికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొండదొర, ఇప్టూ జిల్లా అధ్యక్షులు ఎం.గోపాలం, పికెఎస్ నాయకులు దాసరి వెంకటరమణ, టి.అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకటరమణ ఉన్నారు.

నవధాన్యాలతో భూసారం

ప్రజాశక్తి-వేపాడ

నవధాన్యాలతో భూసారం పెరుగుతుందని మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో నవధాన్యాలతో పంట కోత ప్రయోగం చేపట్టారు. కార్యక్రమంలో సబల ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీరభద్రస్వామి, పెంటయ్య, మల్లేష్ నాయుడు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

పండ్ల మొక్కల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒ ఆదిలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన రైతులు వారి భూమికి సంబంధించిన పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, సెల్ నెంబరుతో కార్యాలయానికి వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజామృతంతో నారుశుద్ధి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామంలో బీజామృతంతో వరినారు శుద్ధి చేయడంపై ఎంటి సన్యాసమ్మ అవగాహన కల్పించారు. సర్పంచ్ శానాపతి లీలావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. బీజామృతంతో వరినారు శుద్ధి చేసి, చిగురు తులిసి, కాలిబాటలు పెట్టి నాట్లు వేయించారు. దీనివల్ల తెగుళ్లను నివారించవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో విసిఆర్‌పి జి.వెంకట్రావు, నాయకులు శానాపతి అప్పారావు, జి.రామస్వామి నాయుడు పాల్గొన్నారు.

నేడు భోగాపురం మండల సమావేశం

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి ఉప్పాడ అనూష అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

లేబర్ కోడ్లతో కార్మికులకు నష్టం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ



బొబ్బిలి.. మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-బొబ్బిలి

లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులకు నష్టం వాటిల్లుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ఆందోళన వ్యక్తంచేశారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గ్రోత్ సెంటర్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లతో ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలయ్యే పరిస్థితి లేదన్నారు. రోజుకు పని గంటలు 8 గంటల నుంచి 12 గంటలకు పెరుగుతాయన్నారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని చేపట్టే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు కార్మిక వర్గం, ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు శేషగిరి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, ఎండిఎం, ఆశా, మున్సిపల్ యూనియన్ నాయకులు రామలక్ష్మి, ఆశ శాంతమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. శుక్రవారం స్థానిక జ్యూట్‌మిల్ గేటు వద్ద కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ఈ నెల 9న రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.వాసు, ఎం.పైడిరాజు, శంకరరావు, రాము, జగదీశ్ పాల్గొన్నారు.

మెరకముడిదాం, గరివిడి : ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను స్కీం వర్కర్లు, పలు రంగాల కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు టివి రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయం వద్ద, గరివిడిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక, సేవారంగం సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిభారం మోపి 8గంటల పనిని 10గంటలకు పెంచి చట్టాలను తీసుకువచ్చాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. అనంతరం ఆయా మండలాల సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు. మెరకముడిదాం మండల కన్వీనర్‌గా టి.మాలతి, కో కన్వీనర్‌గా గౌరి, కమిటీ సభ్యులుగా లక్ష్మి, డి. గౌరి, సత్యవతి, లక్ష్మణరావు, కె. రాములప్పడు ఎన్నికయ్యారు. కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు ఎ.గౌరినాయుడు పాల్గొన్నారు. గరివిడి మండలం సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఎ.గౌరినాయుడు, కోకన్వీనర్‌గా జె.విశ్వనాథరాజు, కమిటీ సభ్యులుగా జివి బంగారమ్మ, సభ్యులుగా లక్ష్మి, పిసిని అప్పలనాయుడు, శనపతి పాపినాయుడు, శనపతి రమణ, కరణం సన్యాసినాయుడు, ఒఎస్‌ఎన్ మూర్తి, లక్ష్మణ, ఎ.రాము ఎన్నికయ్యారు.

విజయనగరం టౌన్ : కార్మికులను బానిసలను చేసే 4 లేబర్ కోడ్లు రద్దు, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉపాధి భద్రత, కనీస వేతనాలు అమలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఈనెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్ మోహన్ రావు, బి. రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం కోట జంక్షన్ వద్ద సిమెంట్ కలాసీలు, ఆటో డ్రైవర్లుతో సమ్మె స్టిక్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజు, రామనాయుడు, రమణ , విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమ్మె నోటీసు

కొత్తవలస : ఈ నెల 9న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శుక్రవారం స్థానిక ఎంఇఒ జి.శ్రీదేవికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, తదితర డిమాండ్లపై సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు.

చేసింది చెప్పడమే 'తొలి అడుగు' లక్ష్యం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజాశక్తి - సంతకవిటి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను తెలుసుకోవడమే సుపరిపాలనలో తొలిఅడుగు లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొండగూడెం, కృష్ణంవలస గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అనంతరం సంతకవిటి నుండి కొండగూడెం వరకు రూ.94 లక్షలతో నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, ఎంపిటిసి వల్లూరు గణేష్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గురవాన నారాయణరావు, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బవిరి శ్రీనుబాబు, సమతం శ్రీను, మహేష్ బాబు, వై.భాషా తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని బొప్పడాం, జోగరాజుపేట అలుగోలు, మదుపాడ గ్రామాల్లో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్ ఆధ్వర్యాన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు బొంతు వెంకటరమణ, ఆల్తి బాబూరావు, కురిమినేని దివాకర్, నల్లం శ్రీనివాసరావు, తాడ్డి సత్యనారాయణ, అంబల్ల పరుశురామ్, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : మండలంలోని చంద్రంపేట గ్రామంలో టిడిపి మండల నాయకులు భాస్కర్ నాయుడు, ఆళ్ల విజయ్ కుమార్ ఇంటింటి ప్రచారం చేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూడి గాంధీ, రంది చిన్నరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని జొన్నాడ గ్రామంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పతివాడ అప్పలనారాయణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పతివాడ విద్యాసాగర్ నాయుడు, మాజీ సర్పంచ్ కోరాడ రమేష్, పార్టీ గ్రామ అధ్యక్షులు జగదీష్, ఆముదాల భాస్కరరావు, సారిక మురళి, టి.శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో అభివృద్ధి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

దృఢ సంకల్పంతో అభివృద్ధి దిశగా అడుగులు వేయొచ్చని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. స్వర్ణాంధ్ర-2047పై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమీక్షను ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి విభాగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్షలో స్థానిక సమస్యలను గుర్తించి, శాశ్వత పరిష్కారాల కోసం సమన్వయంతో ముందడుగు వేయాలని ఆమె సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ప్రత్యేకాధికారి ఇ.మురళి, ఐదు మండలాల అధికారులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో సంస్కరణలు

లక్కవరపుకోట : విద్యా విధానంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంస్కరణల్లో సరికొత్త ఒరవడికి నాంది పలికారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం లక్కవరపుకోటలో కెజిబివిలో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ కూర్మారావు, సర్పంచ్ కె.పార్వతి, మాజీ ఎంపిపి కొల్లు రమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కె.ఈశ్వరరావు, పుట్ట శ్రీనివాసరావు, కెజిబివి ఎస్ఒ బి.ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

గొంప వెంకటరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి-వేపాడ



గొంప దేవుడమ్మ (ఫైల్)

టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తల్లి దేవుడమ్మ (92) గురువారం రాత్రి మరణించారు. ఆమె గత కొంతకాలంగా వృద్ధాప్యంతో మంచానికే పరిమితమయ్యారు. దేవుడమ్మ మరణించిన విషయం తెలుసుకున్న డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల రాంప్రసాద్, డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామినాయుడు, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు.. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

గజరాజుల అలజడి

ప్రజాశక్తి- వంగర

పది రోజుల క్రితం వంగర మండలంలోకి ప్రవేశించిన గజరాజులు పలు గ్రామాల్లో పంటలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి సంగాం నుండి మగ్గూరు, ఓని అగ్రహారం, శివ్వాం పొలాలు మీదుగా వంగర కొండకు చేరుకున్నాయి. కొబ్బరి మొక్కలు, వరి నార్లు తదితర పంటలను ధ్వంసం చేయడంతోపాటు వంగరలోని తంగుడు వెంకటరమణ కు చెందిన రైస్ మిల్లు సెట్టర్ ధ్వంసం చేశాయి, శుక్రవారం వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కూత వేటు దూరంలో ఉన్న జీడి తోటలో ప్రవేశించాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల హెచ్ఎం కూర్మినాయుడు ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం వంగర రాజాం ప్రధాన రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో హల్చల్ చేయడంతో అప్రమత్తమైన పోలీసులు అటవీ శాఖ సిబ్బంది వాహన రాకపోకలను కొంత సమయం నిలిపివేశారు. అనంతరం గజరాజులు అక్కడ నుంచి వంగర, శివ్వాం పొలాల మీదుగా ఎం.సీతారాంపురం పొలాల్లోకి చేరుకున్నాయి.

డ్రాపౌట్ విద్యార్థులను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-రేగిడి

డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలని ఎంఇఒలు ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడి బయట విద్యార్థులు ఉండరాదని ఆయన వెల్లడించారు. ఇంటింటి కార్యక్రమం ద్వారా డ్రాపౌట్ లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర వహించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రతి విద్యార్థికీ అందించాలని ఆదేశించారు. ఈ నెల 10న జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం విజయవంతంగా ప్రతి పాఠశాలలోనూ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ పొన్నాడ అప్పలనాయుడు, సిఆర్‌ఎంటిలు లంక ఆదినారాయణ, కెబూరు వెంకటరమణ, కెంబూరు చంద్రరావు, కలగాటి మోహనరావు, అటెండర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో అనధికార మద్యం దుకాణాలపై ముమ్మరంగా దాడులు కొనసాగుతున్నాయి. పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన వ్యక్తిని 16 మద్యం బాటిల్స్‌తో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ మాట్లాడుతూ మద్యం విక్రయాన్ని నిర్వహించవద్దు, ప్రోత్సహించవద్దని సూచించారు. ప్రజలు గవర్నమెంట్ అనుమతితో నడిచే మద్యం దుకాణాల నుంచే మద్యం కొనుగోలు చేయాలని, బెల్టు షాపుల గురించి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ శిరీష పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం కార్మిక చట్టాలు అమలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, బి.గీత డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లిమర్ల జ్యూట్‌మిల్ యాజమాన్యం కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. యాజమాన్యం వాటా కింద పిఎఫ్ బకాయిలు చెల్లించడం లేదని, గ్రాట్యుటీ సమస్య పరిష్కరించడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం యూనియన్ అధ్యక్షులుగా నామాల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా మద్దిల అప్పలనాయుడును ఎంపిక చేశారు.

సోంపురం కార్యదర్శిగా కృష్ణారావు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సోంపురం పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావుకు బదిలీ అయింది. కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెంలో పనిచేస్తున్న కృష్ణారావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో మండలంలో పనిచేసిన అనుభవం ఉందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని కృష్ణారావు చెప్పారు.

ఫలక్‌నుమా రైలులో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రైళ్లలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా గురువారం రాత్రి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో లోకల్ పోలీసు, జిఆర్‌పి, ఈగల్, ఆర్‌పిఎఫ్ పోలీసులతో సంయుక్త తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి వకుల్ జిందల్ మాట్లాడుతూ ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి ప్రధానంగా ఒడిశా రాష్ట్రం నుండి ఇతర ప్రాంతాలకు రైళ్ల ద్వారా అక్రమంగా రవాణ అవుతుందన్న సమాచారంతో ప్రత్యేకంగా రైళ్లను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు చేపట్టామన్నారు. ఈ బృందం విజయనగరం రైల్వే స్టేషనులో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కి విశాఖపట్నం చేరుకొనే లోగా అన్ని భోగీల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. అన్ని భోగీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బ్యాగులను, లగేజ్, సూట్కేసులను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. తనిఖీలో ఎటువంటి గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలు లభించలేద న్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని ఎస్‌పి తెలిపారు. తనిఖీల్లో బొబ్బిలివలస ఎస్ఐ రాజేష్, జిఆర్‌పి ఎస్ఐ బాలాజీరావు, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ, 20మంది సిబ్బంది, డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు పోలీసుశాఖ నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. పోలీసుశాఖ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. ముందుగా డిఎస్‌పి కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని తెలిపారు. అలాకాకుండా, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్‌పి వకుల్ జిందల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహించారు. సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల సభ్యులు

సర్వజన ఆస్పత్రిని మెడికల్ కాలేజీకి తరలించాలని నిరసన

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సర్వజన ఆసుపత్రిని ప్రభుత్వ మెడికల్ కాలేజి వద్దకు తరలించాలని, ఆ స్థానంలో కేన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ పౌరవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాసంఘాలు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపాయి. జిల్లా సర్వజన ఆసుపత్రికి విపరీతమైన రోగుల రద్దీ పెరగడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం వలన సర్వజన ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరలించి ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి ఆవరణలో కేన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చెయ్యాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టిబాబ్జి ప్రభుత్వాన్ని కోరారు. గాజులరేగలో 70 ఎకరాల్లో విశాలమైన వాతావరణంలో మెడికల్ కళాశాలను నిర్మించారని, అక్కడే అత్యవసర క్రిటికల్ కేర్ కూడా నిర్మాణం జరుగుతుందని, 750 బెడ్స్ గల అధునాతన ఆసుపత్రి భవనం కూడా ఉందని, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రి లో పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే అత్యాధునిక వైద్యం అందించే కేన్సర్ ఆసుపత్రి ని ఏర్పాటు చేస్తే ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు, కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,శ్రీ విజయదుర్గా విభిన్న ప్రతిభవంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దవడ కొండబాబు, అంబేద్కర్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణ, పిడకల ప్రభాకరరావు, ఇప్పలవలస గోపాలరావు,కోటం శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తీయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మురుగునీటి కాలువలలో పూడికలు తీసి శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్, మహారాజుపేట, పూల్ బాగ్ రోడ్డు, రాజా కళాశాల ప్రాంతాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలువలలో పూడికలు ఉండడంతో తొలగించాలని ఆదేశించారు. వర్షాలు విస్తారంగా కురవడంతో వరదనీరు సక్రమంగా వెళ్లేలా చూడాలన్నారు. కాలువలపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. కాలువలలో చెత్త వేయకుండా చూడాలని, చెత్త వేస్తే జరిమానా విధించాలన్నారు. ఆమెతో శానిటరీ ఇన్స్పెక్టర్ మురళీ, సిబ్బంది ఉన్నారు.